**తెలుగు కళాసమితి (న్యూజెర్సీ) వారి 1985 ఉగాది మినీకథల పోటీలో రు.250/-లు.బహుమతి పొందిన కథ**

# బుట్ట బొమ్మలు


## భట్టిప్రోలు కృష్ణమూర్తి

**వి**శాఖపట్నంలో సబ్ జడ్జిగా ఉంటున్న జగదీశ్ హైదరాబాద్‌లో కాలేజీ లెక్చరర్‌గా ఉన్న స్నేహితుడు రమా కాంతాన్ని చూడడానికి వచ్చాడు. మాటలాడే సందర్భంలో రమాకాంతం అన్నాడు ''మనకు బి.ఎలో క్లాస్‌మేట్ బాపిరాజు జ్ఞాపకం లేదూ? ఇప్పుడు ఊళ్లోనే ఉన్నాడు-సేల్స్‌టాక్స్ ఆఫీసులో హెడ్‌క్లర్క్‌గా!''

''మంచి సరదాగా ఉండేవాడు. వెళ్లి కలుద్దాం ఒకసారి.''

పదకొండు గంటలకు ఆ ఆఫీసుకు వెళ్లి బాపిరాజును కలుసుకున్నారు వాళ్ళు. వాళ్ల రాకకు ఎంతో పొంగిపోయాడు అతడు.

కాంటీన్‌లో ఫలహారమూ, కాఫీ, బాతాఖానీ పూర్తయిన వెనుక ''ఇంక మేము వెళ్తాం, సాయంత్రంరా మా ఇంటికి'' అన్న రమాకాంతం ఆహ్వానం అందుకుని బాపిరాజు ''మా సి.టి.ఓ. రాజారావు చాలా మంచివాడు. ఒకసారి రండి, ఇంట్రడ్యూస్‌చేస్తాను.'' అని వాళ్లను తన బాస్ గదిలోనికి తీసుకువెళ్లాడు. ఆ గదిలో పరదాలు తొలిగించుకుని లోపలికి అడుగు పెట్టిన జగదీశ్ అక్కడ మెత్తల కుర్చీలో కూర్చున్న మనిషి మొహం చూడగానే నివ్వెరపడి రెప్పవేయకుండా అటు వైపే చూస్తూ అలాగే ఉండిపోయాడు. ఆ ఆఫీసరు కూడా త్రుళ్లిపడినట్లయి జగదీశ్ మొహమే చూస్తూ ఉండిపోయాడు కొంతసేపు.




అంతకుముందు రోజురాత్రి విశాఖనుండి హైదరాబాద్‌కు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణం చేస్తున్నాడు జగదీశ్. శీతాకాలం కావడం వలన రైలు అనకాపల్లి చేరేటప్పటికే బాగా చీకటిపడిపోయింది. తుని స్టేషన్‌లో రైల్వే ఉద్యోగి ఒకడు ఇద్దరు స్త్రీలను తోడుకునివచ్చి జగదీశ్ కూర్చున్న బెర్తుకు ఎదుటి బెర్తు మీద వాళ్లను కూర్చోపెట్టి దిగిపోయే ముందు జగదీశ్ ఏ ఊరు వెళ్తున్నాడో కనుక్కుని అన్నాడు ''మా అమ్మగారూ, మా చెల్లి శిరీషా, కాజీపేట వెళ్తున్నారు. కొద్దిగా చూస్తూ ఉండండి. ఒంటరి ఆడవాళ్లు.'' ''అలాగే...'' అన్నాడు జగదీశ్.

జగదీశ్‌ది క్రింద బెర్తు, అపై బెర్తుల వీళ్లిద్దరూ అతని ప్రక్కన కూర్చుని ఉన్నారు. ఒకడు తెల్లగా సన్నగా ఉంటే రెండవవ్యక్తి నల్లగా భారీగా ఉన్నాడు.

రైలు రాజమండ్రి చేరుకునేలోగా ఆ తెల్లని వ్యక్తి కాళ్ళుచాపి శిరీష కాళ్లకు తగిలించడం, ఆ అమ్మాయి మొదటిసారి కాళ్ళు వెనుకకు తీసుకోవడం, రెండోసారి ఆ వ్యక్తికాళ్ళు తగిలినప్పుడు చిరాకుగా మొహంపెట్టి అతని వైపు చుర చురమాడడం, ఆ మనిషి చిరునవ్వు నవ్వుతూ 'సారీ' అనడం గమనించాడు జగదీశ్.

రాజమండ్రి స్టేషన్‌లో ఆ బాక్స్‌లోని అయిదుగురూ భోజనాలూ, టిఫినూ సాగించారు. కాంటిన్ సర్వీస్ భోజనాలు చేస్తున్న తన పక్క వ్యక్తుల వైపునుండి వస్తున్న గాలిలో బరువైన విస్కీ వాసన ముక్కుపుటాలకు తగిలి వారివైపు వింతగా చూశాడు, టిఫిన్ చేస్తున్న జగదీశ్. ఇద్దరూ పెద్దమనుషులలాగే కనిపిస్తున్నారు. కాని వాళ్లసంభాషణ మటుకు వినికిడిలో ఆడవాళ్ళు ఉన్నారు అన్న స్పృహ లేకుండా అసభ్యంగా సాగుతుంది.

రైలు గోదావరి వంతెన మీద వెళ్తున్నది. అటు తిరిగి పడుకున్న తమకాళ్ల పట్టున సీటు చివరకూర్చుని ఉంది శిరీష. ఆమె లేచి తల్లిని లేపి మధ్య బెర్తు బిగించడం మొదలుపెట్టింది. జగదీశ్ ఆమెకు సాయంచేయగా థాంక్స్ చెప్పింది. రైలు కొవ్వూరు చేరేటప్పటికి ఎవరి బెర్తులలో వాళ్ళు సర్దుకున్నారు.

బెజవాడ వదిలి వాయవ్య (నార్త్‌వెస్ట్) దిశగా వెళ్తున్న ఆ పెట్టెలో ఊదారంగు బల్బు వెలుగుతూంది. గాఢనిద్రలో ఉన్న జగదీశ్ ''సార్, సార్...'' అన్న పిలుపువిని ఉలిక్కిపడి లేచికూర్చుని ఎదుట నిలబడిన శిరీషను

చూసి ఆశ్చర్యంగా "ఏమిటయిందమ్మా?" అని అడిగాడు. ఆ అమ్మాయి నెమ్మదిగా అంది "ఈ మధ్య బెర్తుమీద పెద్దమనిషి నన్ను అల్లరి పెడుతు న్నాడు. ఇప్పటికి రెండు మూడుసార్లు నా బెర్తువైపు చెయ్యిజాపి నన్నుతాకాడు. కొద్దిగా మీరు గట్టిగా చెప్పండి."

జగదీశ్ లేచినిలబడి నిద్రనటిస్తున్న తెల్లవ్యక్తిని తట్టి లేపుతూ "ఏయ్ మిస్టర్ లే——" అన్నాడు చిరుకోపంతో. కళ్లు నులుపుకుంటూ లేచికూర్చున్న ఆ వ్యక్తి చిరాకుగా మొహంపెట్టి అన్నాడు "ఏమిటిది—నిద్రపోతుంటే డిస్టర్బ్ చేస్తూ?"

"చూడండి, మీరు పెద్దమనుషులా కనిపిస్తున్నారు. పెద్దమనిషితరహాగా నడుచుకుంటే మంచిది."




"ఏమిటామాటలు?" అంటూ కిందకి దిగి జగదీశ్‌ను గద్దించాడు ఆ వ్యక్తి.

"ఈ అమ్మాయి నడగండి చెప్తుంది. తాగొచ్చుగాని కంట్రోల్‌లో ఉండడం కూడా అలవాటు చేసుకోవాలి..."

"మర్యాదగా మాట్లాడు..."

"నువ్వే మర్యాదగా మాట్లాడు..."

ఇద్దరి వాదనా అంతకంతకు హెచ్చు స్థాయికి చేరుతూంది. అందరూ మూగారు అక్కడ. చివరకు అందరూ తననే నిందించడం చూసి తెల్లవ్యక్తి అందరికీ నమస్కారం పెట్టి "పొరపాటున నిద్రలో చేయి విసిరి ఉంటాను. క్షమించండి." అని తన డాన్‌జు అనే కార్యకలాపాలకు స్వస్తి చెప్పి తన బెర్తులో పడుకున్నాడు.

బాపిరాజును తప్పకుండా సాయంత్రం రమ్మని చెప్పి రిక్షాలో కూర్చున్న తర్వాత ఈ సంగతి రమాకాంతానికి చెప్పి నవ్వుతూ అన్నాడు జగదీశ్.

"అదీకారణం ఆగదిలో అడుగుపెట్టగానే నేను నివ్వెర పడడానికి ఆ తెల్లవ్యక్తే ఈ సి.టి.ఒ! నన్ను చూడగానే డంగయిపోయాడు!"

"అదా? మీఇద్దరూ అలా ఒకరినొకరు నివ్వెరపడి చూసుకోడానికి కారణం? అయినా నిన్న రాత్రి అంత దూరం వాదనలో వెళ్లినవాళ్లు మళ్లా రెండు నిమిషాల్లో సరుదుకుని ఆ సంగతి జరగనట్లే ఎలా సరదాగా మాట్లాడగలిగాడో అని ఆశ్చర్యంగా ఉంది."

నవ్వి అన్నాడు జగదీశ్ "ఏముంటుంది నటనకి? అందరం బుట్ట బొమ్మలమే!"

"అంటే?"

ఒకసారి జగదీశ్ తన ఇరవై ఏళ్ల వయసులో గుణుపురం-నవపడాలైట్‌రైల్వే పాసింజర్‌లో ప్రయాణం చేస్తున్నాడు. ఆ రైలులో పైన కిరసనాయిలు దీపాలు పెట్టారు. కొద్ది దూరం వెళ్లగానే అన్నీ కునుకుతాయి. కునకకపోయినా పేరుకి మటుకే దీపాలలా వుంటాయి అవి. జనసమ్మర్దం బాగావుంది రైలులో. కిటికీ దగ్గర కూర్చున్న జగదీశ్‌కి ఎదురుగా కూర్చునివుంది తెల్లగా నిండుగా అందంగా ఉన్న ఒక ఇరవైఏళ్ల అమ్మాయి. ఆమె ప్రక్క అరవైఏళ్ల వయస్సు జబ్బుభర్త ఉన్నాడు. వలాకీగా చొరవగా మాట్లాడుతున్నా ఆమె చెప్పడం వల్ల అతనికి బ్రహ్మచెముడనీ, కళ్లూ సరిగా కనిపించవనీ జగదీశ్‌కు తెలిసింది. ఆ పెట్టెలో దగ్గరలో ఉన్న వాళ్లందరూ ఒరియావాళ్లే కావడంవల్ల ఆ పిల్ల జంకూ బొంకూ లేకుండా జగదీశ్‌తో 'డబ్బు మస్తుగా వుందని ఈ ముసలి పీనుగుకి కట్టబెట్టారు నన్ను మా అమ్మా నాన్నా, వెధవడబ్బు కాల్చడానికా, ఒంటికీ మనస్సుకీ తృప్తి లేకపోయాక!" అంటూ లేచి తనసీట్లో దుప్పటి మడత పెట్టి భర్తను పడుకోబెట్టి "కొద్దిగా జరగండి—ఆ కిటికీ దగ్గర కూర్చుంటాను" అంది. ఆశ్చర్యపడ్డ జగదీశ్ కొద్దిగా జరిగి ఆ అమ్మాయి కూర్చోడానికి జాగా ఇచ్చాడు. ఆ తరువాత ఒకటి రెండు నిముషాలకు ఆ అమ్మాయి మీద జాలిపడ్డట్టుగ్గా పైదీపం కొండెక్కింది. (ఆరిపోయింది).

"బతికాం" అంటూ ఆ అమ్మాయి జగదీశ్ మీదకి వాలిపోయి అతని కుడిచేతిని అందుకుని ముద్దు పెట్టుకుని తన గుండెలమీదికి తీసుకుంది.

ఈ సంగతి రమాకాంతానికి చెప్పి అన్నాడు జగదీశ్: "ఆరాత్రి నవపడా చేరుకునేవరకూ నేను చేసిన పని ఇండియన్ పీనల్ కోడ్‌లో అడల్టరీ సెక్షన్ కింద నేరం కావడానికి ఒక వెంట్రుకవాసిలో తప్పిపోయింది. ఆ పెట్టెలో అవకాశమేఉంటే చట్టానికి అందని క్రిమినల్‌ని అయి ఉందును నేనూ! అందుకే అందరం బుట్ట బొమ్మలమే అన్నాను!"

పకపకనవ్వి అన్నాడు రమాకాంతం!

"ఒక బుట్ట బొమ్మకథ" అనో లేకపోతే "కన్‌ఫెషన్స్ ఆఫ్ ఎ జడ్జ్" అనో పేరు పెట్టి ఆత్మకథరాయి- మంచి పాపులర్ అవుతుంది!"

●

## స్వపరిచయం

జననం 1921 - శ్రీకృష్ణాష్టమి - రాజమండ్రి; విద్యాభ్యాసం: నెల్లూరు, గుంటూరు, తెనాలి, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నం,కటక్. బి.ఏ., యల్.యల్.బి., జయపురం మహారాజా శ్రీ విక్రమదేవ వర్మగారి ఆఫీసులో నాలుగేళ్లు, ఒరిస్సా ప్రభుత్వంలో 36 ఏళ్లు సేవచేసి 1979లో అడిషనల్ కలెక్టర్ & అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్‌గా పదవీ విరమణ.

1936లో మొదటి కథ ప్రచురితం. నవల, కథానిక, నాటిక, నాటకం, వ్యాసం, పద్యకవిత, వచన కవిత మొదలైన వివిధ ప్రక్రియలలో రచనావ్యాసంగం. వివిధ పత్రికల్లోనూ, పుస్తకరూపంలోనూ - 1939 నుండి 1952 వరకు జయపురం సంస్థానం ఆస్థానకవి. ఇప్పటికి అయిదు రేడియో నాటకాలు ప్రసారితం. ఒక రేడియో నాటకానికీ, నాలుగు నాటి కలకూ,



మూడు నవలలకూ, నాలుగు కథా నికలకూ, ఒక మినీకథకూ బహుమతులు లభించాయి. పద్యకవిత 'పరిణతి', 'భారతీయ కవిత - 1953' (సాహిత్య అకాడెమీ, న్యూఢిల్లీ) లో సంకలితం. 1961లో "బంగారు సంకెళ్లు" నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ పురస్కారం.

వివరణ:- మన తెలుగుదేశంలో తీర్థయాత్రలలో జాతరలలో (ఫెయిర్స్‌లో) డొల్లగా ఉన్న మనుషుల్లా జంతువుల బొమ్మలు మామూలు సైజుకి మూడు నాలుగు రెట్లలో తయారు చేసి వాటిలో కళాకారులు దూరి అటూ ఇటూ చాకచక్యంగా తిరుగుతూ సరస సంభాషణలు చేస్తూ వినోద ప్రదర్శనతో జనాన్ని ఆనంద పరుస్తూంటారు. ముఖ్యంగా గుర్రపుస్వారీ చేసే స్త్రీ, పురుషుల బొమ్మలూ, పురాణ కథల్లో రావణుడు, సీతా రాములూ, వినాయకుడూ బొమ్మలూ ప్రసిద్ధి. లోపలి మనిషి పూతిక పుల్లలా ఉన్నా భీముడిలా కనిపించవచ్చు. పగలు చూస్తే రాత్రికలలోకి వచ్చి భయపెట్టే ఆడదీ రతీదేవిలా కులకవచ్చు బుట్ట బొమ్మలో దూరి! అసలు స్వరూపాన్నీ స్వభావాన్నీ కప్పిపెట్టుకుని పైకి మరో రకంగా కనిపించే మనుషులకు ఈ బుట్ట బొమ్మలు అన్న మాట సరిపోతుంది.

—రచయిత.